https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 96 గురువారం 13-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## మోదీజీ.. మీరు కొంచెం మారారు!

**ప్రధానితో ఖర్గే సరదా వ్యాఖ్య..నవ్వుతూ భుజం తట్టిన మోదీ**

**సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో అరుదైన దృశ్యం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** రాజకీయంగా నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకునే అధికార, విపక్ష నేతలు సరదాగా నవ్వుతూ మాట్లాడుకున్నారు. విభేదాలు పక్కనపెట్టి హాయిగా పలకరించుకున్నారు. ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలు చమత్కరించుకున్న దృశ్యం ఎన్సీపీ నేత సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో కనిపించింది. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ నవ్వులు పూయించింది. ఢిల్లీలో జరిగిన ఈ రిసెప్షన్‌కు రాహుల్, ప్రియాంక, ఖర్గే తదితరులు హాజరయ్యారు. ప్రధాని మోదీ ప్రతిపక్ష నేత రాహుల్ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. అనంతరం ప్రియాంకను పలకరించారు. 'ప్రియాంకా జీ ఎలా ఉన్నారు?' అని అడిగారు. 'నేను బాగున్నాను' అని బదులిచ్చిన ఆమె.. 'మీరెలా ఉన్నారు?' అని ప్రధానిని అడిగారు. 'నేను అలాగే ఉన్నాను' అని మోదీ నవ్వుతూ జవాబిచ్చారు. అక్కడే ఉన్న ఖర్గే కల్పించుకొని "అలా ఏమీ లేదు.. మీరు కొంచెం మారిపోయారు" అంటూ చమత్కరించారు. దీంతో మోదీ నవ్వుతూ ఖర్గే భుజంపై తట్టారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఈ నెల 19న సమావేశం కానుంది. తాజా రాజకీయ పరిస్థితులతో పాటు విద్యార్థుల సమస్యలు, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఈ సమావేశంలో వ్యూహాలు రూపొందిస్తారు.

# గోదావరి నీళ్లు గట్టిగా ఎత్తిపోయండి

## ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి వీలైనంత నీటిని ఎత్తిపోయాలి

- ఎక్కడ చూసినా కాళేశ్వరం నీళ్లేనంటూ ఇన్నాళ్లూ విపక్షాల అవాస్తవ ప్రచారం
- అసలు ఎత్తిన నీళ్లెన్ని, వదిలిన నీళ్లెన్ని..?
- ఖర్చయిన కరెంటు ఎంత? లెక్కలు తీయండి
- విపక్షం ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టండి
- కాళేశ్వరం లేకుండానే ఎల్లంపల్లి నిండుతోంది
- దేవాదుల నుంచి ఎన్నడూ లేనంతగా తొమ్మిది పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నాం
- మిల్లర్ల నుంచి బకాయిలు రాబట్టాల్సిందే!
- మహిళా సంఘాలకు ధాన్యం మిల్లింగ్ బాధ్యతలు
- ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉండే 5 జిల్లాల్లో 'సైలో బ్యాగ్' నిర్మాణాలు.. సమీక్షల్లో సీఎం రేవంత్




**హైదరాబాద్, ఆగస్టు 12:** గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితోపాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతోందని చెప్పారు. ఇన్నాళ్లూ ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని విపక్ష నేతలు ప్రచారం చేసుకున్నారని.. దీనిపై అసలు వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ బ్యారేజీల నుంచి ఎత్తిపోసిన నీళ్లెన్ని, కిందకు వదిలేసిన నీళ్లెన్ని, వాడుకున్న నీళ్లెన్ని అనే వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని చెప్పారు. బుధవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్చార్డీ)లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "2019 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని ప్రచారం చేసుకున్నారు. 2019లో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపూర్తయింది. 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగింది, అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయటపడ్డాయి. 2019 నుంచి 2023 దాకా కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎన్ని నీళ్లను ఎత్తిపోశారు? మళ్లీ కిందికి వదిలేసిన నీళ్లెన్ని? ఎన్ని టీఎంసీలను వినియోగించారు? ఎత్తిన నీటి కోసం ఎంత విద్యుత్ ఖర్చయిందనే సమగ్రమైన లెక్కలు తీసి ప్రజల ముందుంచాలి" అని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన అధికారులు.. ఐదేళ్లలో 161.36 టీఎంసీలను ఎత్తిపోశారని, కానీ వరద రావడంతో ఎత్తిపోసిన నీటిలో 60 టీఎంసీలకుపైగా మళ్లీ నదిలోకే వదిలేశారని వివరించారు. అయితే ఈ వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మేడిగడ్డ నుంచి ఎత్తిపోయకుండా నీళ్లన్నీ వదిలేస్తున్నారని విపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని.. కాళేశ్వరం లేకుండానే ఎల్లంపల్లికి 43 టీఎంసీల వరద వచ్చిందని గుర్తుచేశారు. అందులో మిడ్‌మానేరుకు 17 టీఎంసీలను ఎత్తిపోశామని.. మరో 20 టీఎంసీలకుపైగా నదిలోకి వదిలేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని చెప్పారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. గట్టు రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.03 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచాలని, ఈ మేరకు ప్రతిపాదనలను 14న జరిగే కేబినెట్ భేటీలో పెట్టాలని సీఎం ఆదేశించారు. గుడెందొడ్డిలో పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవకాశాలపై అధ్యయనం కోసం కన్సల్టెన్సీని నియమించాలన్నారు.

మిగతా 2లో...

## ఇందిరమ్మ టవర్స్‌కు నేడే శంకుస్థాపన

**కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీలో భూమిపూజ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

- క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం
- 16 నియోజకవర్గాల్లో 8వేల ఇళ్లు
- టవర్ల నిర్మాణానికి 90 ఎకరాలు
- రూ.807.40 కోట్లకు అనుమతి
- ఏడాదిలో గృహ ప్రవేశాలు!
- కొత్త అధ్యాయానికి నాంది:పొంగులేటి
- ఇళ్ల కోసం 50 వేలు దాటిన దరఖాస్తులు



**హైదరాబాద్/హైదరాబాద్ సిటీ:** పట్టణ గృహనిర్మాణ పథకం కింద కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో చేపట్టదలచిన 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణం విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టవర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం శంకుస్థాపన చేయనున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. క్యూర్ పరిధిలో మొత్తం 24 నియోజకవర్గాలు ఉండగా, మొదటి దశలో 16 నియోజకవర్గాల్లో టవర్ల నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 90 ఎకరాల్లో ఈ టవర్లు ఉంటాయి. వీటి నిర్మాణానికి అవసరమైన రూ.807.40 కోట్ల నిధులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల్లో 8 వేల ఇళ్లను నిర్మించనున్నట్లు, ఏడాదిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలి విడతలో నిర్మించే ఇళ్లలో ఏడాదిలో గృహ ప్రవేశాలు జరిగేలా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. బుధవారం ఇందిరమ్మ టవర్స్‌పై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో

మిగతా 2లో...

# జస్టిస్ వర్మ నేరస్థుడే!

- ఆయన మీద వచ్చిన అన్ని ఆరోపణలూ రుజువయ్యాయి
- నోట్లకట్టలు ఎలా వచ్చాయన్నదానిపై న్యాయమూర్తి సరైన జవాబివ్వలేదు.. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసే యత్నం
- జస్టిస్ వర్మ వివరణ తప్పించుకునే విధంగా ఉంది
- త్రిసభ్య కమిటీ నిర్ధారణ.. పార్లమెంటుకు నివేదిక సమర్పణ
- శీతాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మ అభిశంసన ప్రక్రియ?



**న్యూఢిల్లీ, ఆగస్టు 12** ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్‌రూంలో భారీ ఎత్తున డబ్బు దొరికిన మాట వాస్తవమేనని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందన్నదానిపై ఆయన ఇచ్చిన వివరణ తప్పించుకునే విధంగా ఉందని లోక్‌సభ స్పీకర్ నియమించిన త్రిసభ్య కమిటీ తెలిపింది. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను రుజువైనట్లుగానే భావించవచ్చునని, ఈ మేరకు తమకు తగిన సాక్ష్యాధారాలు లభించాయని పేర్కొంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్య సభ్యులుగా ఉన్న కమిటీ తన నివేదికను బుధవారం పార్లమెంట్ ఉభయ సభలకు సమర్పించింది. జస్టిస్ వర్మపై నమోదైన మూడు ఆరోపణలు రుజువయ్యాయని ఈ నివేదికలో దర్యాప్తు కమిటీ స్పష్టం చేసింది. మొదటి ఆరోపణ ప్రకారం.. తన నివాసంలో దొరికిన నోట్ల కట్టలు ఎవరివి? ఎక్కడి నుంచి వచ్చాయి? అన్న ప్రశ్నలకు సంతృప్తికరమైన వివరణ ఇవ్వటంలో జస్టిస్ వర్మ విఫలమయ్యారని, కాబట్టి, ఆ ఆరోపణ రుజువైందని పేర్కొంది. నోట్లకట్టలు బయటపడిన ఘటనకు సంబంధించిన సాక్ష్యాధారాలను భద్రపర్చలేదని, సంబంధిత అధికారులు తనిఖీ చేసి సీల్ చేయటానికి

మిగతా 2లో...

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే

**వాటి అమలును నాలుగు వారాలు నిలిపేసిన హైకోర్టు**

2




## ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థికసాయం

**బాధితులకు అండగా నిలిచిన జీఎస్ఎల్ వైద్య కళాశాల యాజమాన్యం**

అయిజ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాల యాజమాన్యం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లసపూర్ గ్రామంలోని బాధిత కుటుంబాన్ని కళాశాల యజమాని కుమారుడు తరుణ్, కోడలు సాధ్విక, కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణిలు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కళాశాల తరఫున రూ.20 లక్షల చెక్కును ప్రియాంక తండ్రి వెంకటేశ్‌కు అందజేశారు. ఇప్పటి వరకు ప్రియాంక కళాశాలకు చెల్లించిన ఫీజులను కూడా తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కాగా, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. పార్టీపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, లీగల్‌సెల్ ద్వారా న్యాయసహాయం అందిస్తామని కేటీఆర్ భరోసానిచ్చారు.

## హైడ్రా కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్



**హైదరాబాద్:** హైకోర్టు స్టే ఆదేశాలను ఉల్లంఘించి ప్రైవేటు ఆస్తులను కూల్చివేసిన ఆరోపణలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై రాష్ట్ర హైకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ అభియోగాలు మోపింది. గతంలో ఆస్తులపై కోర్టులు ఇచ్చిన స్టే ఉత్తర్వుల గురించి తెలుసుకోకుండా.. రెవెన్యూ అధికారుల నుంచి కూల్చివేతల కోసం ఎలాంటి సూచనలు రాకుండానే హైడ్రా ఏకపక్షంగా కూల్చివేతలు చేపడుతోందని బుధవారం ఆగ్రహం వ్యక్తంచేసింది. వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టిన వ్యవహారంపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని రంగనాథ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసింది. అలాగే హైడ్రా ఏర్పడకముందు ఉన్న కోర్టుల స్టేల గురించి ఆయా జిల్లాల కలెక్టర్లు హైడ్రాకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి మార్గదర్శకాలు జారీచేయాలని సూచించింది. కోర్టు గత ఉత్తర్వులకు విరుద్ధంగా మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలం కేంద్రంలోని సర్వే నెంబరు194/1, 211లోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో కూల్చివేతలు చేపట్టినందుకు మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజ్‌గిరి, తిరుమలగిరి మండలాల తహసీల్దార్లను రికార్డులతో సహా హాజరుకావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది.

మిగతా 2లో...

## తెలంగాణలో కొత్తగా 460 పోలింగ్ కేంద్రాలు

- మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 36,353కు పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఈఓ సుదర్శన్‌రెడ్డి



**హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా 460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా సవరణతో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను కూడా అధికారులు చేపట్టారు. తెలంగాణలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, స్థలాల మార్పు, పేర్ల సవరణ, తొలగింపు, విలీన ప్రతిపాదనలకు భారత ఎన్నికల సంఘం అనుమతించింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల సంఖ్య 35,985 ఉండగా... అందులో ఓటర్ల సంఖ్య అతి తక్కువగా ఉన్న 92 కేంద్రాలను విలీనం చేశారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే

**వాటి అమలును నాలుగు వారాలు నిలిపేసిన హైకోర్టు**

**9 దాకా లబ్ధిదారులకు చెక్కులు ఇవ్వొద్దని ఆదేశం**

**సర్కారు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం**







హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నాలుగువారాలపాటు నిలిపివేస్తూ హైకోర్టు సంచలన ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకాల అమలుకు సంబంధించిన ఎనిమిది జీవోలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ పథకాల చట్టబద్ధతపై కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పి.. దాఖలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకూ.. ఈ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు ఇవ్వొద్దని ఆదేశించింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు చట్టబద్ధత లేదంటూ న్యాయవాది విజయ్‌గోపాల్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపించిన పిటిషనర్.. 2014 నుంచి ఈ పథకాలు అమలు చేస్తున్నారని.. తొలుత ఎస్సీ, ఎస్టీలకు ఆ తర్వాత బీసీలు, ఈబీసీలకు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ పథకాల అమలుకు ఎలాంటి చట్టం లేదా చట్టబద్ధమైన ప్రొవిజన్లు లేవని పేర్కొన్నారు. ఈ పథకాల కింద లబ్ధిదారుల అర్హత, ఆదాయ పరిమితి వంటి అంశాలను నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చింది? అనే ప్రశ్నికు సమాధానం లేదని.. వీటికి రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఖర్చు చేయడం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొన్నారు. చట్టం లేకుండా కేవలం ఎగ్జిక్యూటివ్ పవర్‌ను ఆధారంగా చేసుకుని అమలు చేస్తున్నారని.. అలా ప్రజల నిధులను ఖర్చు చేయడం రాజ్యాంగంలోని 202 అధికరణకు విరుద్ధమని తెలిపారు. కేవలం జీవోల ద్వారా ఈ పథకాలపై భారీగా నిధులు ఖర్చు చేశారని.. ఆ జీవోలు నిరవధికంగా కొనసాగడం చెల్లదని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం.. 'ఈ పథకాలకు సంబంధించిన ఎనిమిది జీవోల చట్టబద్ధతపై వివరణ ఇస్తామని గత విచారణ సందర్భంగా అదనపు అడ్వకేట్ జనరల్ తెలిపారు. దీంతో కౌంటర్లు దాఖలు చేయడానికి ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి కౌంటర్లూ దాఖలు కాలేదు. మరింత సమయం కావాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది కోరారు. ఈ నేపథ్యంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన ఎనిమిది జీవోలపై స్టే విధిస్తున్నాం. ' అని పేర్కొంటూ తదుపరి విచారణను 9కి వాయిదా వేసింది.

# గోదావరి నీళ్లు ...

(మొదటిపేజీ తరువాయి)

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో ఆయకట్టు కోసం అవసరమైన ప్రతిపాదనలను మంత్రివర్గం ముందుంచాలన్నారు.

**కాళేశ్వరం బ్యారేజీల్లో డయాఫ్రం వాల్: మంత్రి ఉత్తమ్**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని సమావేశంలో మంత్రి ఉత్తమ్ వివరించారు. సీకెంట్ పైల్స్‌లో లోపాలు, డి జైన్‌లో సమస్యలు, నిర్వహణలోపాలతో బ్యారేజీలు విఫలమయ్యాయని పరీక్షల్లో తేలిందని చెప్పారు. డయాఫ్రం వాల్ నిర్మాణంతో సీపేజీలను అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశంలో ఎన్డీఎ?సఏతో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**కాళేశ్వరంతో వరి రికార్డు ఉత్పత్తికి సంబంధం లేదు: సీఎం**

తెలంగాణలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరడానికి కాళేశ్వరం ప్రాజెక్టు కారణంకాదని.. గత పదేళ్లలో మంచి వర్షాలు, సాగునీటి లభ్యత పెరగటం, రైతు రుణమాఫీ, రైతుభరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కేంద్రిత విధానాలతోనే ధాన్యం ఉత్పత్తి పెరిగిందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య 'ఆంధ్రజ్యోతి' ఎడిటోరియల్ పేజీలో చేసిన విశ్లేషణను సీఎం బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రాష్ట్రంలో రైతులు గత కొన్నేళ్లలో సుమారు 15 లక్షల కొత్త బోర్లు వేశారని, వాటిద్వారా అదనంగా 40 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి, వారి సంక్షేమం, ఆదాయంలో మార్పు కాంగ్రెస్ పాలనలోనే ప్రారంభమైందన్నారు.

**ఏమిటీ 'సైలో బ్యాగ్' నిర్మాణాలు?**

ఎనిమిది నుంచి పది అడుగుల వెడల్పుతో.. 60 నుంచి 90 మీటర్ల పొడవుతో.. భారీ సంచుల్లా ఉండే నిర్మాణాలనే 'సైలో బ్యాగ్స్' అంటారు. ఒక్కో సైలో బ్యాగ్‌లో 250 టన్నుల వరకు ధాన్యం నిల్వ చేయవచ్చు. నీళ్లు, కాంతి చొరబడకుండా ఉండే ప్రత్యేకమైన ప్లాస్టిక్ పాలిమర్లతో ఈ బ్యాగులను రూపొందిస్తారు. ధాన్యం తడిసిపోవడం, పురుగులు పట్టడం, చెడిపోవడం వంటివాటికి అవకాశం తక్కువ. గోదాములు, కాంక్రీట్ ప్లాట్‌ఫారాల వంటివాటితో పోలిస్తే ఖర్చు చాలా తక్కువ. ఎలాంటి ప్రత్యేకమైన నిర్మాణాలు అవసరం లేకుండా.. పొలాల్లోనే ఈ 'సైలో బ్యాగ్'లను ఏర్పాటు చేయవచ్చు. ధాన్యాన్ని అటు కొనుగోలు కేంద్రానికి, ఇటు మిల్లులకు, గోదాములకు తిప్పాల్సిన ఇబ్బంది తప్పుతుంది. అవసరమైనప్పుడు నేరుగా గోదాములకో, మిల్లులకో తరలించవచ్చు.

# నీటి వివాదాలకు సామరస్యమే పరిష్కారం



తెలుగు రాష్ట్రాలు విడిపోయి దశాబ్దం దాటినా నీటి వివాదం మాత్రం ఇంకా సమసిపోలేదు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్-తెలంగాణల మధ్య కొనసాగుతున్న వివాదం చూస్తే, 'ఇది నిజంగా పరిష్కారం కాని సమస్యేనా? అనే ప్రశ్న తలెత్తుతుంది. కృష్ణా నీటి వివాద పరిష్కారానికి చట్టాలున్నాయి, కమిషన్లున్నాయి. బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వంటి బోర్డులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ... అన్నీ ఉన్నాయి. కానీ, నీటిని రాజకీయ అస్త్రంగా మార్చడంతోనే అసలు సమస్య మొదలవుతోంది. కృష్ణానది వార్షిక సగటు నీటి లభ్యత 2,578 టీఎంసీలు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్?కు 811 టీఎంసీల నీటిని కేటాయిం చారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు (సుమారు 63శాతం), తెలంగాణకు 299 టీఎంసీల (సుమారు 37 శాతం) కేటాయింపు లపై, అప్పటి ముఖ్యమంత్రులుగా ఉన్న చంద్రబాబు, కేసీఆర్ సమక్షంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఒప్పందం జరిగింది. ఇవి తాత్కాలిక ఏర్పాట్లు మాత్రమే, శాశ్వత కేటాయింపులు కావు. తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అపెక్స్ కౌన్సిల్?లో సంతకం చేసిన కేసీఆర్, అధికారం దూరమయ్యాక నేడు జల రాజకీయం చేస్తున్నారు. ప్రజల్లో భావోద్వేగాలు, సెంటిమెంటును రగిలించి రాజకీయంగా లబ్ధిపొందాలన్న దురాశతోనే నీటి నిప్పును రాజేస్తున్నారు. చంద్రబా బును బూచిగా చూపుతున్నారు. బీఆర్?ఎస్ చేస్తున్న ప్రచారంతో తామెక్కడ రాజకీయంగా వెనుకబడిపోతామోననే భయంతో కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర?స్?కు వంత పాడుతోంది. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కావాలంటే జూరాల నుంచి వరద నీటిని ఆ ప్రాజెక్టుకు తరలించాలి. అలా అయితే ఏపీ, తెలంగాణ మధ్య నీటి వివాదం ఉండదు. కానీ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం నుంచి నీటిని తీసుకుంటా మనడంతోనే వివాదం మొదలైంది. తెలంగాణ కొత్త ప్రాజెక్టుల (కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి) ద్వారా ఎగువ ప్రాంతాల్లోనే ఎక్కువ నీటిని నిల్వ చేసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ దిగువన ఉండటంతో, సమయానికి నీరు రాకపోవడం ప్రధాన సమస్య. కృష్ణా డెల్టా రైతాంగంపై దీని ప్రభావం తీవ్రంగా పడుతోంది. గోదావరి నది సగటు నీటి లభ్యత 3,000 టీఎంసీలకు పైగా ఉంది. వాస్తవ వినియోగం కేవలం 1,500 టీఎంసీలకు లోపే. అంటే సగం కంటే ఎక్కువ నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. ఇక్కడే వివాద పరిష్కారానికి కీలక దారి ఉంది. గోదావరి నీటిని సమర్థవంతంగా వినియోగిస్తే కృష్ణాపై ఒత్తిడి తగ్గుతుంది. రాష్ట్రాల మధ్య వివాద తీవ్రత కూడా తగ్గే అవకాశం ఉంటుంది. 2019లో తెలుగు రాష్ట్రాల సీఎంలు జగన్, కేసీఆర్ ఇద్దరూ హైదరాబాద్?లోని ప్రగతి భవన్?లో సమావేశమై అలై బలై నిర్వహించారు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువని, అందుకే గోదావరి నీటిని ఉపయోగించుకుని రాయలసీ మ, తెలంగాణ ప్రాంతాల సాగునీటి సమస్యను పరిష్కరించు కోవాలని నిర్ణయించారు. తాము వేసిన ఈ అడుగు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందంటూ ముఖ్యమంత్రు లిద్దరూ సుద్దులు చెప్పారు! "నదీ జలాల వివాద పరిష్కారానికి ట్రిబ్యునళ్లకు వెళ్లడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లడం వల్ల ప్రయోజనం ఉండదు" అంటూ నాడు కేసీఆర్ జలకథలు చెప్పారు. అంతేకాదు, 'గోదావరి, కృష్ణా నదుల్లో కలిపి ఏటా దాదాపు 4 వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయి. ఈ నీళ్లతో రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేయవచ్చు. వంశధార, నాగావళి, నదుల నీళ్లను కూడా బంగాళాఖాతం పాలు కాకుండా సమర్థంగా వినియోగిస్తే ఉత్తరాంధ్ర వాసుల నీటి కరువు కూడా తీరుతుంది' అంటూ కేసీఆర్? నమ్మబలికారు. నాడు ఆయన చెప్పిన ఆదర్శాలన్నీ ఏమయ్యాయి?! ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులకు రాజకీయ మనుగడ లేదు. ప్రజల్లో సెంటిమెంట్?ను రగిలించడమే లక్ష్యంగా వారు జల రాజకీయం చేస్తున్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలనే నల్లమలకు తీసుకెళు ్తంటే తెలంగాణకు జరిగే నష్టం ఏమిటో అర్థం కావడం లేదు. తెలంగాణలో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్?లు కట్టారు. మహారాష్ట్రలో పుట్టిన గోదావరి మొదట తెలంగాణలో, అనంతరం ఏపీలో ప్రవహిస్తూ అంతర్వేది మీదుగా సముద్రంలో కలుస్తుంది. ఏపీలో గోదావరిపై ధవళేశ్వరం మాత్రమే ప్రధాన ప్రాజెక్ట్?గా ఉంది. ప్రస్తుతం పోలవరం నిర్మాణంలో ఉన్నది. గోదావరి నీళ్లు తరలించడం ద్వారా పల్నాడు, రాయలసీమ, వెలిగొండ, ప్రకాశం ప్రాంతాల ప్రజల సాగునీటి కష్టాలు తీర్చాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. గోదావరి నుంచి 200 టీఎంసీలు నల్లమల ప్రాజెక్టుకు తరలించడం ద్వారా కృష్ణా నీటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఆ నీటిని తెలంగాణకు వాడుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాన్ని న్యాయపోరాటాల కంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడమే ఉత్తమమని తెలంగాణ, ఏపీలకు సుప్రీంకోర్టు సూచన చేయడం అభినందనీయం.

# జస్టిస్ వర్మ ...

(మొదటిపేజీ తరువాయి)

ముందే స్టోర్‌రూంలో ఉన్న వస్తువులను చిందరవందర చేసి ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారన్నది రెండో ఆరోపణ. ఇది కూడా రుజువైందని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. మూడో ఆరోపణ.. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బాధ్యతగా, పారదర్శకంగా, నిజాయితీగా వ్యవహరించాల్సిన న్యాయమూర్తి వైఖరి ఆ విధంగా లేదన్నది కూడా రుజువైందని కమిటీ తెలిపింది. ఘటన జరిగిన తర్వాత కరెన్సీ నోట్లు మాయం కావటం వెనుక కారణాలను కూడా జడ్జి వెల్లడించలేదని, సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేలా స్టోర్‌రూంను శుభ్రం చేయించారని వెల్లడించింది. సాక్షులు సమర్పించిన ఆధారాలతో ప్రశ్నించినప్పుడు జస్టిస్ వర్మ తప్పించుకునే విధంగా, అసంతృప్తికరంగా సమాధానాలిచ్చారని పేర్కొంది. అంతేగాక, క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావటానికి జస్టిస్ వర్మ ముందుకు రాలేదని గుర్తు చేసింది. వీటన్నింటి రీత్యా అతడిపై వచ్చిన ఆరోపణలు అన్నీ రుజువైనట్లుగా భావిస్తున్నామని కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు రెండు సంపుటాల్లో నివేదికను స్పీకర్‌కు సమర్పించింది.

# ఇందిరమ్మ టవర్స్‌కు..

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించిన 5 ఎకరాల స్థలంలో 4 టవర్లు నిర్మించనున్నామని, ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్లు ఉంటాయని, ఒక్కో ఫ్లోర్‌లో 12 ఫ్లాట్స్ చొప్పున మొత్తం 480 ఇళ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. వీటికి రూ. 43. 20 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఈ ఇళ్ల కోసం జూలై 20 నుంచి దరఖాస్తులు స్వీకరించామని, బుధవారం వరకు 50 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, అనంతరం అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి రాజకీయ జోక్యం, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదలకు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఇల్లు మంజూరుకాని దరఖాస్తుదారులకు.. వారు చెల్లించిన రూ. 10 ఈఎండీని వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు.

**వచ్చే ఏడాది బోనాల నాటికి గృహప్రవేశం**

ఇందిరమ్మ టవర్లను శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతిదశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నా.. నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ టవర్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. హైదరాబాద్ గృహనిర్మాణ రంగంలో ఇది ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం.. పేదలు నగరానికి దూరంగా కాకుండా, నగరంలోనే గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందని మంత్రి తెలిపారు. అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. వేలాది మంది పేదలకు సొంతింటిని అందించే ఈ పథకం ఒక్కసారి చేపట్టి ముగించేది కాదని, హైదరాబాద్‌లో పేదల గృహ అవసరాల మేరకు దశలవారీగా ఉండే నిరంతర కార్యక్రమమని స్పష్టం చేశారు.

**నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు ఇలా..**

క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు బుధవారం సాయంత్రానికి 50 వేల దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం నాటికి 6,821 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో 5800, ఖైరతాబాద్‌లో 6 వేలు, శేరిలింగంపల్లిలో 3800, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 2వేలు, రాజేంద్రనగర్‌లో 2200, అంబర్‌పేటలో 3200, సనత్‌నగర్‌లో 1500కు పైగా దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 15 వరకు గడువు ఉండటంతో ఇంకా వందల మంది మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. గడువు ముగిసిన తర్వాత మొత్తం దరఖాస్తులపై పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది.

**లబ్ధిదారు వాటా చెల్లింపు ఇలా..**

ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇల్లు మంజూరైన లబ్ధిదారు తన వాటా రూ. 6 లక్షలను నాలుగు దశల్లో చెల్లించాల్సి ఉంటుంది. మొదటి దశ ప్రొవిజినల్ అలాట్‌మెంట్ సమయంలో రూ.లక్ష, రెండో దశ.. ఆర్సీసీ నిర్మాణం పూర్తయ్యాక రూ. 2 లక్షలు, మూడోదశ ఇల్లు పూర్తయ్యే దశలో రూ. 2 లక్షలు, నాలుగో దశలో ఫ్లాట్ అప్పగించే సమయంలో రూ.లక్ష చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇళ్ల కేటాయింపులో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, క్లాస్-4 ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ ఉంటుంది. మిగిలిన 50 శాతం ఫ్లాట్‌లను జనరల్ క్యాటగిరీకి కేటాయించనున్నారు. అన్ని క్యాటగిరీల్లోనూ 30 శాతం ఫ్లాట్‌లను మహిళలకు రిజర్వ్ చేయనున్నారు.

# హైడ్రా కమిషనర్‌పై..

(మొదటిపేజీ తరువాయి)

వారు జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరణ ఇస్తూ.. వాణి కోఆపరేటివ్ సొసైటీలో కూల్చివేతలు చేపట్టాలని తాము హైడ్రాకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు. అలాగే తాము ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 వరకు కూల్చివేతలు చేపట్టిందని పేర్కొన్నారు. హైడ్రా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జనరల్ ల్యాండ్ రిజిస్టర్ (జీఎల్ఆర్)లోని 243, 255 నిబందనల పరిధిలో ఉన్న స్థలాలను రక్షించాలని రెవెన్యూశాఖ నుంచి సూచనలు ఉన్నందునే మ్యాపింగ్ చేసి కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి సూచనలు, ఉత్తర్వులు లేకుండా.. జీఎల్ఆర్ 243, 255 నిబంధనల పరిధిలోని భూమి పిటిషనర్ల సర్వే నెంబరులోనే ఉందని ఎలా మ్యాపింగ్ చేశారని ప్రశ్నించింది. రికార్డు లేకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం చెల్లదని స్పష్టంచేసింది. అనుమతి లేకండా మేడ్చల్ కలెక్టరేట్ పరధిలో హైడ్రా ఎక్కడెక్కడ కూల్చివేతలు చేపట్టిందో నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. అలాగే హైడ్రా ఏర్పడకముందు కోర్టులు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఆ సంస్థ పట్టించుకోకపోవడంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని.. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు కోర్టు కేసుల గురించి హైడ్రాకు సమాచారం ఇవ్వాలని సూచించింది.

# 'మంచిర్యాల'పై రామ్మోహన్ కన్ను..!

- గులాబీ గూటిలో టికెట్ కోసం కొత్త ఎత్తుగడలు..!
- కేటీఆర్ లక్షెట్టిపేట పర్యటన తర్వాత మొదలైన కదలికలు..
- మంచిర్యాల బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా పెరిగిన రాజకీయ హడావుడి
- కష్ట కాలంలో పార్టీని మోసిన దివాకర్‌రావును పక్కకు నెట్టే ప్రయత్నాలా..?
- గులాబీ జెండా కోసం నిలిచిన వారికే ఇప్పుడు ముప్పా..?!
- పదవులు అనుభవించిన కాలంలో సొంత ప్రాంతానికి ఏం చేశారు..?
- ఇప్పుడు మంచిర్యాల అభివృద్ధి బాధ్యతలు తీసుకుంటారా..?
- టికెట్ కోసం ప్రయత్నాలు తప్పితే ప్రజల కోసం పోరాటం ఎక్కడిది..?
- రామ్మోహన్ రాజకీయ ప్రస్థానం పై సొంత గూటి(బీఆర్ఎస్) శ్రేణుల్లోనే సవాలక్ష ప్రశ్నలు..!





**మంచిర్యాల: మంచిర్యాల నియోజక వర్గ బీఆర్ఎస్ రాజకీయాల్లో కొత్త పావులు కదులుతున్నాయన్న ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున మంచిర్యాల నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో రామ్మోహన్ తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించారన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా కేటీఆర్ లక్షెట్టిపేట పర్యటన తర్వాత రామ్మోహన్ రాజకీయ కదలికలు ఒక్కసారిగా వేగం పుంజుకోవడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. అయితే టికెట్ కోసం అధిష్ఠానం చుట్టూ తిరగడం సులువే కానీ.. ప్రజల మధ్య నిలబడి వారి సమస్యల కోసం పోరాడటం అంత ఈజీ కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.**

రాష్ట్ర స్థాయిలో కీలక పదవిని అనుభవించిన రామ్మోహన్.. తన రాజకీయ ప్రభావాన్ని సొంత ప్రాంత అభివృద్ధికి ఎంత మేర ఉపయోగించారనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలానికి చెందిన వ్యక్తిగా ఉన్నప్పటికీ.. సొంత ప్రాంతం, సొంత మండలం సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన కృషి ఏమిటో చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పదవులు ఉన్నప్పుడు ప్రజలకు ఎంత అందుబాటులో ఉన్నారు..? అధికారంలో ఉన్న సమయంలో ప్రాంతానికి ఎన్ని శాశ్వత అభివృద్ధి పను(నిధులు)లు తీసుకొచ్చారు..? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకుండానే ఇప్పుడు మంచిర్యాల నియోజక వర్గానికి నాయకత్వం వహిస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారనే చర్చ మొదలైంది. సొంత గడపను మార్చలేని నాయకత్వం.. మొత్తం నియోజక వర్గం రూపురేఖలు మార్చుతుందా..? అన్న విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

### ఆపత్కాలంలో అంటి పెట్టుకుంటే..!

మరోవైపు బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిన తర్వాత పార్టీకి అసలైన పరీక్ష ఎదురైన సమయంలో నడిపెల్లి దివాకర్ రావు మాత్రం గులాబీ జెండాను వీడలేదు. ఎమ్మెల్యేగా ఓటమి ఎదురైనా పార్టీని, కార్యకర్తలను వదిలి పెట్టకుండా అండగా నిలిచారు. రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తూ కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ వచ్చారు. ఆయన కుమారుడు విజిత్‌రావు కూడా తండ్రితో కలిసి పార్టీ కోసం పని చేస్తున్నారు. అధికారం ఉన్నప్పుడు కనిపించిన నాయకులు.. అధికారం పోయిన తర్వాత ఎక్కడ ఉన్నారు..? కష్టకాలంలో కార్యకర్తల మధ్య ఎవరు నిలిచారు..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఇప్పుడు రామ్మోహన్ వర్గానికి ఎదురవుతోందని బీఆర్ఎస్ కార్యకర్తలు అంటున్నారు.

కష్టకాలంలో పార్టీని కాపాడిన దివాకర్‌రావు కుటుంబాన్ని పక్కకు నెట్టి.. ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ టికెట్ కోసం తెరపైకి వచ్చే నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలా..? అన్న ప్రశ్న బీఆర్ఎస్ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. పార్టీ కోసం సంవత్సరాలుగా జెండా మోసిన కార్యకర్తలకు, నాయకులకు రాజకీయంగా విలువ లేకుండా కేవలం టికెట్ ఆశతో వచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తే పార్టీ పునాదులే దెబ్బతింటాయని కార్యకర్తలు సుతిమెత్తగా హెచ్చరిస్తున్నారు. టికెట్ అనేది ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని.. కార్యకర్తల చెమటతో నిలిచిన పార్టీ గుర్తు పై పోటీ చేసే అవకాశం మాత్రమేనని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

### అధికారంలో ఉండి చేసిందేమిటీ..?

ఇక రామ్మోహన్ విషయంలో మరో ప్రశ్న కూడా తెరపైకి వస్తోంది. పదవులు అనుభవించిన సమయంలో సొంత ప్రాంత అభివృద్ధిపై తనదైన ముద్ర వేయలేకపోయిన వ్యక్తి.. ఇప్పుడు మంచిర్యాల నియోజక వర్గ అభివృద్ధికి ఏం చేస్తారనే దానిపై ప్రజలకు ఏం చెబుతారు..? కేవలం అధిష్ఠానం వద్ద పరిచయాలు, రాజకీయ సమీకరణాలు, పర్యటనలతో టికెట్ సాధించవచ్చేమో కానీ.. ప్రజల మనసులు గెలవడం అంత సులువు కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. మంచిర్యాల సీటు కోసం ఎవరు ఎన్ని పావులు కదిపినా.. చివరికి ప్రజల మధ్య ఎవరు ఉన్నారు, కష్టకాలంలో పార్టీ కోసం ఎవరు నిలబడ్డారు, నియోజకవర్గానికి ఎవరు ఏం చేశారన్నదే అసలు కొలమానం. రామ్మోహన్ టికెట్ ఆశలు ఎంతవరకు ఫలిస్తాయో, దివాకర్‌రావు నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు ఏ రూపం దాల్చుతాయో రానున్న రోజుల్లో తేలనుంది.

# విధాన వైకల్యాలలో భారత దౌత్యనీతి

భారత విదేశాంగ విధానం ఎవరి పర్యవేక్షణలో అమలు అవుతున్నది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించడంలో, గట్టిగా సమర్థించడంలో ప్రభావదాయక పాత్ర నిర్వహిస్తోన్న విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నది ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానంగా కనిపిస్తోంది. అయితే సౌత్ బ్లాక్ (విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నెలవు) విధానాలను నిర్ణయిస్తున్నది, నిర్దేశిస్తున్నది ఎవరు అని జైశంకర్ సైతం ఆశ్చర్యపోక తప్పని పరిణామాలు సంభవిస్తున్న రోజులివి. బంగ్లాదేశ్?తో సంబంధాల విషయంలో నెలకొన్న దౌత్యపరమైన గందరగోళ పరిస్థితులే అందుకొక తాజా నిదర్శనం. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు నివాళులర్పించేందుకు
జైశంకర్ 2025 డిసెంబర్ 31న ఢాకా వెళ్లారు. ఖలీదా మృతిపట్ల సంతాపం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాసిన ఒక వ్యక్తిగత లేఖను ఆమె కుమారుడు తారిక్ రెహమాన్‌కు జైశంకర్ అందజేశారు. బంగ్లాదేశ్ భావి ప్రధాని అని అందరూ విశ్వసిస్తున్న తారిక్ రెహమాన్‌తో జైశంకర్ కరచాలనం చూస్తే, క్షీణించిన భారత్–బంగ్లాదేశ్? ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే సూచనలు కనిపించాయి. ఇది జరిగిన రెండు రోజులకే బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తాను కాంట్రాక్ట్ తీసుకున్న క్రీడాకారుల జాబితా నుంచి తొలగించాలని ఇండియన్ ప్రీమియర్? లీగ్? (ఐపీఎల్?) ఫ్రాంచైజీ కోల్?కతా నైట్? రైడర్స్? (కేకేఆర్?)ను భారత్? క్రికెట్? నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదేశించింది. ఆ ప్రైవేట్? ఫ్రాంచైజీ మరో ఆలోచన చేయకుండా ఆ ఆదేశాన్ని శిరసావహించింది. దీనిపై బంగ్లాదేశ్? ప్రభుత్వం తీవ్రంగా ప్రతిస్పందించింది. ముస్తాఫిజుర్? రెహమాన్? తొలగింపునకు నిరసనగా తాము టీ 20 మ్యాచ్?లు భారత్?లో ఆడబోమని బంగ్లాదేశ్? క్రికెట్? బోర్డ్? ప్రకటించింది. సహజంగానే ఒక ప్రశ్న అనివార్యమవుతోంది: కేవలం 48 గంటల వ్యవధిలో––అత్యున్నత స్థాయి దౌత్య సమావేశం, ఒక క్రికెటర్?ను లక్ష్యంగా చేసుకున్న ఒక నిష్కారణ నిర్ణయం తీసుకోవడానికి మధ్య ఏమి జరిగింది? బంగ్లాదేశ్? ఆగ్రహపూరిత ప్రతిస్పందనను ప్రేరేపించింది ఏమిటి? చోటుచేసు కున్న మార్పుకు కారణమేమిటి? అంటే, హిందూత్వ తీవ్రవాదులు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ప్రచారోద్యమమేనని చెప్పక తప్పదు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఢాకాలో ఎటువంటి రాజీ లేకుండా కఠిన వైఖరితో వ్యవహరించాలని మోదీ ప్రభుత్వాన్ని ఈ హిందూత్వ శక్తులు గట్టిగా డిమాండ్? చేశాయి. కేకేఆర్?పై ఉత్తరప్రదేశ్?కు చెందిన బీజేపీ శాసనసభ్యుడు సంగీత్? సోమ్? తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రత్యేకించి దాని యజమాని, బాలీవుడ్? సూపర్?స్టార్? షారుఖ్? ఖాన్?ను తీవ్రంగా తప్పుపట్టారు. ముస్తాఫిజుర్? రెహమాన్?తో కాంట్రాక్టు కుదుర్చుకున్న షారుఖ్? ఖాన్?ను 'దేశ ద్రోహి' అని సంగీత్? సోమ్ ఆరోపించారు. అయితే కేకేఆర్?కు షారుఖ్? ఖాన్? ఒక్కడే యజమాని కాదని, ఇంకా ఇద్దరు యజమానులున్నారని, వారు బాలీవుడ్? నటి జూహీ చావ్లా, ఆమె భర్త జై మెహతా అనే విషయాన్ని సంగీత్? సోమ్? తెలివిగా విస్మరించారు. మీ పేరులో ఖాన్ అని ఉంటే చాలు హిందూత్వ తీవ్రవాదుల కోపావేశాలకు మీరు తప్పక లక్ష్యమవుతారు సుమా! సాధారణ సమయాల్లో వివేచనాయుతమైన ప్రభుత్వం హిందూత్వ తీవ్రవాదుల వీరాలాపాలను విస్మరించి ఉండేది. అయితే 'న్యూ' ఇండియాలో ఈ అప్రధాన హిందూత్వ శక్తులే 'ప్రధాన స్రవంతి'గా భాసిల్లుతున్నాయి! విషపూరిత మతతత్వ రాజకీయాలకు వత్తాసునిస్తున్న ప్రభుత్వం, తనకు సంపూర్ణ మద్దతుదారులు అయిన సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయే సంఘ్? పరివార్? శ్రేణుల డిమాండ్లను విస్మరించలేదు.

## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు..**



**రామకృష్ణాపూర్, ఆగస్టు 12, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో తలెత్తుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మురళీకృష్ణకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్లపై ఏర్పడిన గుంతల వలన వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అలాగే కాలువలలో పేరుకుపోయిన చెత్తాచేదారం వలన దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వీధిలైట్లు అన్ని కాలనీలలో సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా రహదారులపై పశువులు సంచరించడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారని, గతంలో ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. వీధి కుక్కలు కోతుల బెడదకు ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కమిషనర్ ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, నాయకులు పనాస రాజయ్య, మేకల సురేందర్, శివకుమార్, సతీష్, రమేష్, లింగయ్య, ప్రేమ్ సాగర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## సిఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం



**లక్షెట్టిపేట ఆగస్టు 12 (మన సమాజం)** మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సాగరిక, ఆరో వార్డు కౌన్సిలర్ తోట సువర్ణ- రమేష్ చేతుల మీదుగా మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొక్కలు నాటడం అనేది మన పర్యావరణాన్ని రక్షించడానికి, భూమిని పచ్చదనంతో నింపడానికి చేసే అత్యంత ముఖ్యమైన కార్యక్రమం అని అన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి అన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ చెట్ల నాటడం అనే పండుగను జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని భవిష్యత్ తరాలకు ప్రాణవాయువైన ఆక్సిజన్ ను సంపూర్తిగా అందించాలంటే మొక్కలను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నుమోనియా బారిన పడిన చిన్నారుల్లో కనిపించే లక్షణాలు ఇవే..

ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు న్యుమోనియా అనే ప్రాణాంతక ఇన్ఫెక్షన్ ను ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడం కష్టతరంగా మారుతుంది. ఇది దాదాపు 30 మిలియన్ల మంది పిల్లలను ప్రభావితం చేస్తుందని గణంకాలు చెబుతున్నాయి. ఈ ఇన్ఫెక్షన్ కూడా అధిక మరణాల రేటును కలిగి ఉంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలలో 14 శాతం మంది మరణాన్ని ఎదుర్కోవచ్చు. బ్యాక్టీరియా, వైరస్ లు ఈ న్యుమోనియాకు ప్రధాన కారణాలు. న్యుమోనియా కారణంగా ఊపిరితిత్తులు బలహీనపడడంతో పాటు మొత్తం రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. కనుక పిల్లలల్లో న్యుమోనియాను ముందుగానే గుర్తించడం అవసరం.

### కఫంతో కూడిన దగ్గు..

న్యుమోనియా లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స ఇవ్వడం వల్ల పిల్లలల్లో మరణాల రేటును కూడా తగ్గించవచ్చు. న్యుమోనియా బారిన పడినప్పుడు పిల్లలల్లో కొన్ని సంకేతాలు, లక్షణా లు కనిపిస్తాయి. వీటిని చాలా మంది గుర్తించరు. సాధారణ జలు బు, దగ్గుగా భావిస్తూ ఉంటారు. కనుక పిల్లల్లో న్యుమోనియా లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. నిరంతరం పొడి దగ్గు రావడం లేదా క?ఫంతో కూడిన దగ్గు రావడం శరీరంలో న్యుమోనియా ఉందని చెప్పడానికి ఒక సంకేతం. ఈ దగ్గు ఊపిరితిత్తుల్లో వాపు , అవి శ్లేష్మం లేదా ద్రవంతో నిండడం వల్ల వస్తుంది. ఈ శ్లేష్మాన్ని లేదా ద్రవాన్ని బయటకు పంపడానికి పిల్లలకు దగ్గు వస్తుంది. సాధారణ దగ్గులా కాకుండా న్యుమోనియా వల్ల వచ్చే దగ్గు బొంగురుగా ఉంటుంది, తీవ్రమైన నొప్పిని కలిగిస్తుంది. న్యుమోనియా ముఖ్య లక్షణాల్లో వేగంగా శ్వాస తీసుకోవడం కూడా ఒకటి.



# గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించా..

## హాట్ టాపిక్‌గా సమంత కామెంట్స్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత టైటిల్ రోల్‌లో నటిస్తున్నచిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సమంత తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించానంది సామ్. చాలా తక్కువ టైంలోనే ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు.. ఉత్సాహంగా నా పేరును కేకలు వేస్తూ పిలవడం, నా సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. ఇదంగా చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆ స్టార్‌డమ్ అనే మాయలో మునిగిపోయానని చెప్పింది సమంత. అంతేకాదు మీడియా నా గురించి రాస్తోంది. ఏడాదికి నేను ఎన్ని సినిమాల్లో నటించాననే విషయాలపైనే ఎక్కువ ఆసక్తి చూపించేదానిని అంటూ చెప్పుకొచ్చింది. హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్ సినిమాలను అందిస్తున్నప్పటికీ తాను అసలు సినిమాకు ఏం ఇస్తున్నానని ఎప్పుడూ కూడా ఆలోచించలేదని చెప్పింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనిత లాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగుతున్న ట్రైలర్ సినిమాలో సామ్‌ను సరికొత్తగా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# గ్లామర్‌కు గుడ్‌బై ,యాక్షన్ మోడ్‌లో కాజల్ అగర్వాల్ .. అమ్మడి స్పీడ్ మాములుగా లేదుగా..!

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. రెండు దశాబ్దాలుగా దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కాజల్, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్‌లో పూర్తిగా భిన్నమైన పాత్రలపై దృష్టి సారిస్తోంది. గ్లామర్ రోల్స్‌కు దూరంగా ఉంటూ, కథకు ప్రాధాన్యత ఉన్న పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే కాజల్ అగర్వాల్ తొలిసారి ఓటీటీ ప్రపంచంలో అడుగుపెట్టబోతోంది. 'స్వామి రారా' ఫేమ్ దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సిరీస్‌పై ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి. 'విశాఖ'లో కాజల్ పాత్ర ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఒకవైపు సాధారణ గృహిణిగా కనిపించే ఆమె పాత్ర, మరోవైపు అండర్‌వల్డ్ ప్రపంచాన్ని శాసించే లేడీ డాన్‌గా మారడం కథలో కీలక మలుపుగా ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. అమాయకత్వం, ఆవేశం, శక్తివంతమైన నాయకత్వం వంటి విభిన్న భావోద్వేగాలను ఒకే పాత్రలో చూపించే అవకాశం కాజల్‌కు దక్కిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సిరీస్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గన్ పట్టుకుని శత్రువులను ఎదుర్కొనే లేడీ డాన్ అవతారంలో కాజల్ కనిపించనున్న సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయని సమాచారం. ఇప్పటికే విడుదలైన అంతర్గత ప్రచార సమాచారం ప్రకారం, ఈ సిరీస్‌లో ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు చేయని స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నాయి. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ సిరీస్‌కు బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన సుస్మితా సేన్ 'ఆర్య' వెబ్ సిరీస్ తరహా ట్రీట్‌మెంట్ ఉండబోతోందట. అయితే కథ, పాత్రలు, కథనం పూర్తిగా కొత్తగా ఉండేలా దర్శకుడు సుధీర్ వర్మ రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న 'విశాఖ' వెబ్ సిరీస్ జూలై లేదా ఆగస్టు నెలలో జియో హాట్‌స్టార్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. అధికారిక విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే, కాజల్ అగర్వాల్ సినిమాల పరంగానూ బిజీగా ఉంది. నందమూరి బాలకృష్ణ హీరోగా, దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు కలిగిస్తోంది. ఒకవైపు వెబ్ సిరీస్‌లు, మరోవైపు భారీ సినిమాలు చేస్తూ కాజల్ అగర్వాల్ తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తోంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథలు, బలమైన పాత్రలను ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోంది.

# పైన ఏమీ లేకుండానే కస్తూరి శంకర్ బోల్డ్ ఫోటో షూట్..



కస్తూరి శంకర్.. ఈమె గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. బుల్లితెర నుండి వెండితెర వరకు అందరికి ఈ పేరు పరిచయమే.. ప్రస్తుతం ఈమె నటిస్తున్న గృహలక్ష్మి సీరియల్ ద్వారా బాగా పాపులర్ అయ్యింది. ఇక అప్పటి నుండి ఈమె సోషల్ మీడియాలో కూడా సందడి మొదలయ్యింది. 1990 లలోనే ఈమె హీరోయిన్ గా నటించింది.. ఇక ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ లో సీరియల్స్ చేస్తూ బాగానే వెనకేస్తుంది. ఇదే సమయంలో ఈమె సోషల్ మీడియాలో కేసుల యాక్టివ్ గా ఉంటూ అనవసరమైన విషయాల్లో కూడా స్పందిస్తూ ఎప్పుడు వార్తల్లో నిలుస్తుంది. ఈమె చేసే వివాదాస్పద కామెంట్స్ వల్ల ఈమె పేరు ఎప్పుడు వినిపిస్తూనే ఉంటుంది. ఇక తాజాగా ఈమె షేర్ చేసిన పిక్ ఇప్పుడు సంచలనంగా మారింది..ముందు నుండే మోడలింగ్ కెరీర్ లో సత్తా చాటిన ఈ భామ అప్పట్లోనే అందాల ఆరబోత చేసేది.. ఆ తర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.. తమిళ్ మాత్రమే కాదు తెలుగు, కన్నడంలో కూడా ఈమె సినిమాలు, సీరియల్స్ చేసి బాగా పాపులర్ అయ్యింది.. ఇరవై ఏళ్లకు పైగానే అన్ని భాషల్లో తనదైన సందడి చేసిన ఈమె ఇప్పుడు సీరియల్స్ తో బిజీ అయ్యింది.తాజాగా షేర్ చేసిన ఫొటోతో అందరికి మైండ్ బ్లాంక్ అయ్యేలా చేసింది.. ఇప్పుడు ఈమె వయసు 49 సంవత్సరాలు.. ఈ వయసులో కూడా ఈమె రెచ్చిపోయి అందాలు ఆరబోస్తుంది.. తాజాగా పైన నూలుపోగు కూడా లేకుండా బోల్డ్ ఫోటో షూట్ చేసింది.. ఓ చంటి బిడ్డను ఎత్తుకుని బోల్డ్ గా అన్ని కనిపించేలా ఈమె చేసిన ఫోటో షూట్ తెగ వైరల్ అవుతుంది. మదర్స్ డే సందర్భంగా ఈ ఫోటో షూట్ చేయగా దీనిని చూసినవారంతా ట్రోల్స్ చేస్తున్నారు.

# మూలాలను మరిచిపోను

పబ్బుల్లో, నైట్ పార్టీల్లో ఎంజాయ్ చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూపే సెలబ్రిటీలు చాలామంది ఉన్నారు. కానీ మంగళూరు భామ శ్రీనిధి శెట్టి అలాంటి వాటికి పూర్తి వ్యతిరేకం. క్లబ్‌లు, పబ్‌ల కన్నా, దేవాలయాల సందర్శనలోనే ఎక్కువ ఆనందం ఉంటుందని, ఖాళీ టైమ్‌లో ఈషా ఫౌండేషన్‌కి వెళ్లి మెడిటేషన్ చేయడంలో ఉన్నంత ఆనందం మరెక్కడా దొరకదని శ్రీనిధి అంటున్నది. ఇంకా ఆమె మాట్లాడుతూ 'నా తల్లిదండ్రులు క్రమశిక్షణతో నన్ను పెంచారు. బాగా చదివించారు. యాక్సెంచర్ వంటి పెద్ద కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న నన్ను మోడలింగ్ సినిమాలవైపు తీసుకొచ్చింది. నేను ఈ రోజు ఎంతటి స్టార్‌ని అయినా కావచ్చు. కానీ మూలాలను మాత్రం మరిచిపోను. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సంస్కారాన్ని వదులు కోను' అంటూ చెప్పుకొచ్చింది శ్రీనిధి శెట్టి.

